
సాక్షి పల్నాడు

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 4,012 క్యూసెక్కులు విడుదల చేశారు.



జగనన్న గోరుముద్ద పరిశీలన

పిడుగురాళ్ల: మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద అమలును గురువారం ఏపీ ఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ చింత వెంకట రామారావు పరిశీలించారు.

ప్రసన్నాంజనేయస్వామి సేవలో..

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామిని సినీ నిర్మాత, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనను ఆలయ అర్చకులు సత్కరించారు.



న్యూస్‌రీల్

బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ దూర విద్య బీఏ, బీకాంలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా దూరవిద్య బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీలో చేరేందుకు తుది గడువును ఈనెల 16 వరకు పొడిగించినట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ స్టడీ సెంటర్ ప్రాంతీయ సమన్వయకర్త పి.గోపీచంద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యూజీ ద్వితీయ, తృతీయ సంవత్సరాలతో పాటు పీజీ ద్వితీయ సంవత్సర ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఈనెల 16 వరకు అవకాశం కలదని తెలిపారు. ఇతర వివరాలకు స్టడీ సెంటర్‌లో నేరుగా, 0863-2227950, 73829 29605 నంబర్లలోనూ సంప్రదించాలని సూచించారు.

స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటిన పాఠశాలలకు అవార్డులు

గుంటూరు ఎడ్యుకేషన్ : మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 2022-23 విద్యా సంవత్సరంలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను తయారు చేసిన ఐదు పాఠశాలలకు అవార్డులు ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు పాల్గొన్న విద్యార్థుల ధ్రువపత్రాలను వ్యాయామోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరించి ఈనెల 16వ తేదీలోపు గుంటూరులోని హిందూ కాలేజీ హైస్కూల్లో పీఈటీ భరత్‌కు అందజేయాలని సూచించారు. వివరాలకు 77948 27674 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

అమ్మా ... మా క్యారెక్టర్లు పెట్టి శునకానందం పొందొద్దని చెప్పు

అంబటి రాంబాబు ట్వీట్

సాక్షి,అమరావతి: మా క్యారెక్టర్లు పెట్టి శునకానందం పొందొద్దని .. మీ మాజీకి చెప్పమ్మా రేణూ అంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు సినీనటి, పవన్ కల్యాణ్ మాజీ భార్య రేణూ దేశాయ్‌కి హితబోధ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ట్వీట్ చేశారు.

నేటి నుంచి పాలిసెట్ వెబ్ ఆప్షన్లు నమోదు

- 14వ తేదీ వరకు కళాశాలల ఎంపికకు ఆప్షన్లు
- 18న సీట్ల కేటాయింపు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఏపీ పాలిసెట్-2023లో అర్హత సాధించి, పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ మేరకు ఇప్పటికే రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. విద్యార్థులు తమ ఇళ్లలోని పర్సనల్ కంప్యూటర్, ప్రైవేటు ఇంటర్నెట్ కేంద్రాలతో పాటు హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లి ఆప్షన్లు నమోదు చేసుకునే వీలుంది. గుంటూరు శివారు నల్లపాడులోని ప్రభుత్వ ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో వెబ్ ఆప్షన్ల నమోదుకు వీలుగా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వెబ్ ఆప్షన్ల నమోదు పూర్తయిన తరువాత ఈ నెల 18న సీట్ల కేటాయింపు జరపనున్నారు. పూర్తి వివరాలకు ఏపీ పాలిసెట్-2023 సైట్‌కు లాగిన్ కావాలి.

ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు

సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి



గుంటూరు మెడికల్ : వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి చెప్పారు. గురువారం గుంటూరు వైద్య కళాశాలలో ర్యాగింగ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ ర్యాగింగ్ చేయటం నేరమని చెప్పారు. ర్యాగింగ్ కేసులలో పట్టుబడితే వారికి శిక్షలు చాలా కఠినంగా ఉంటాయని, శిక్షలు పడితే విద్యార్థుల భవిష్యత్తు పాడవుతుందన్నారు. ర్యాగింగ్ చట్టాల గురించి వివరించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చేస్తున్న కార్యక్రమాల గురించి తెలియజేశారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాస్, అడ్వకేట్ శామ్యూల్, ఎన్‌జీఓ ఆఫ్ గ్రాఫ్ జిల్లా కో ఆర్డినేటర్ సమీర్‌లు ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించి ర్యాగింగ్ జోలికి వెళ్లి జీవితాలను పాడుచేసుకోవద్దని హితువు పలికారు.

◆ వరాల 'బాటలు'

నియోజకవర్గం ప్రగతికి బాటలు పడుతున్నాయి. అమరావతి-రాజుపాలెం మధ్య రూ.148.95 కోట్లతో చేపట్టిన ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే శంకరరావు ప్రారంభించారు. ఇంకా చాలా రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. కొన్ని పూర్తయ్యాయి.



పెదకూరపాడు- భీమినేనిపాలెం మధ్య నిర్మించిన తారు రోడ్డు



అమరావతి-రాజుపాలెం రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

✦ విద్య, వైద్యం జయీభవ

విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మనబడి నాడు-నేడు ద్వారా రూ.68.58 కోట్లతో పాఠశాలల రూపురేఖలు మార్చింది. క్రోసూరులో రూ.7.25 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం పూర్తిచేసింది. అచ్చంపేటలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పూర్తిచేసింది. గ్రామీణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో అత్యాధునిక వసతులు కల్పించింది. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ముంగిళ్లలోకే వైద్యసేవలను తీసుకొచ్చింది.



అచ్చంపేట లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



క్రోసూరులో నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల

నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి ఇలా..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	41,429	466.07
రైతు భరోసా	41,722	225.00
జగనన్న ఇళ్లు	9,251	166.51
ఇళ్ల స్థలాలకు	13,160	82.52
అమ ఒడి	27,720	116.42
ఆసరా (డ్వాక్రా రుణమాఫీ)	39,144	90.48
వైఎస్సార్ చేయూత	15,214	85.57
జగనన్న విద్యా దీవెన	15,552	37.35
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	4,687	18.41
జగనన్న వసతి దీవెన	8,918	10.49
జగనన్న విద్యా కానుక	23,460	11.26
వైఎస్సార్ బీమా	573	9.13
సున్నా వడ్డీ	52183	5.72
ఈబీసీ నేస్తం	4,122	6.18
కాపు నేస్తం	2,339	5.68
వైఎస్సార్ చేదోడు	2,476	7.42
సున్నా వడ్డీ పంట రుణాలు	10,196	3.68
పంట నష్టపరిహారం	4,457	3.38
సీఎం సహాయ నిధి	716	5.18
వాహన మిత్ర	1,021	2.28
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	2,140	1.69
8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు	2,372	7.59

(ఇంకా లా నేస్తం, నేతన్న నేస్తం, మత్స్యకారభరోసా, జగనన్న తోడు, పాస్టర్లు, ఇమామ్‌లు, అర్చకులకు, జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా 4,213 మందికి రూ.3.97 కోట్ల మేర లబ్ధి చేకూరింది.)

అమరేశ్వరుడే అబ్బురపడేలా..

అమరావతిలో వెలిసిన అమరేశ్వరుడే అబ్బురపడేలా.. చెంతనే ఉన్న కృష్ణమ్మ పరవశంతో పరవళ్లు తొక్కేలా.. పెదకూరపాడు ప్రగతిపథాన పరుగులు పెడుతోంది. అభివృద్ధి, సంక్షేమం జోడుగుర్రాల స్వారీతో జయభేరి మోగిస్తోంది. జయహో జగన్ అంటూ నినదిస్తోంది. అబద్ధాలతో అరచేతిలో వైకుంఠం చూపించేందుకు బయలుదేరిన ప్రతిపక్షాల పగటివేషాలపై సింహగర్జన చేస్తోంది.

- నియోజకవర్గానికి నాలుగేళ్లలో రూ.2,032.67 కోట్లు
- సీఎం వైఎస్ జగన్ సహకారం, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో ముందుకు

పెదకూరపాడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా, నంబూరు శంకరరావు ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టాక నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. అభివృద్ధి వైపు వేగంగా అడుగులు పడ్డాయి. గడప గడపలో సంక్షేమ సిరులు కురిశాయి. గత నాలుగేళ్లలో రూ.655.06 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.1,377.61 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది. ఫలితంగా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇవిగో అభివృద్ధి అడుగుజాడలు

- అమరావతి-తుళ్ళూరు దారిలో పెద్ద మద్దూరు వద్ద రూ.42కోట్లతో చేపట్టిన హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం వేగంగా సాగుతోంది.
- రూ.11.89కోట్లతో సీహెచ్‌సీల నిర్మాణం
- రూ.7.20 కోట్లతో పీహెచ్‌సీల నిర్మాణం
- కస్తూరిబా పాఠశాల, రెసిడెన్షియల్ స్కూల్ నూతన భవనాలకు రూ.4.20 కోట్లు కేటాయించారు.
- రూ.5.80 కోట్లతో 14 ముస్లిం, 33 ఎస్సీ, ఎస్టీ, బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టారు.
- అచ్చంపేట మండలం సత్తెమ్మ ఆలయం అభివృద్ధికి రూ.64.50 లక్షలతో చర్యలు చేపట్టారు.
- బెల్లంకొండ మండలం రామాంజనేయపురం వాసులకు పట్టాలు పంపిణీ చేశారు.
- అమరావతి మండలం వైకుంఠపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి ఘాట్ రోడ్డు నిర్మించారు.
- పెదకూరపాడు, తాళ్లచెరువు, పారుపల్లి, మండేపూడి ఎత్తిపోతలకు హైడలాజికల్ క్లియరెన్స్ తీసు కొచ్చారు.
- ఎంపీ నిధులతో రూ.1.30కోట్లతో పనులు చేపట్టారు.
- గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా పనులకు రూ.14 కోట్లు అధికారులు కేటాయించారు.
- ప్రభుత్వ ప్రాధాన్యభవనాల నిర్మాణం వేగంగా జరుగుతోంది.

ప్రగతిపథాన పెదకూరపాడు



ఆనందాల 'వారధి'

దశాబ్దాలుగా పెదకూరపాడు నియోజకవర్గ ప్రజల కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. రూ.60.54 కోట్లతో మాదివాడ వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేశారు. దీనివల్ల ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, పెదకూరపాడు నియోజకవర్గాల మధ్య రాకపోకలకు మార్గం సుగమమైంది. ఈ వంతెన నిర్మాణంతో ఈ ప్రాంతం పారిశ్రామికంగా ప్రగతి బాట పడుతుందని అందరూ ముక్తకంఠంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాదివాడ బ్రిడ్జి నిర్మాణం చారిత్రాత్మకం



కృష్ణా నదిపై మాదిపాడు వద్ద బ్రిడ్జి నిర్మాణం జరిగితే పులిచింతల ప్రాజెక్టు మాదిరి చరిత్రలో నిలిచిపోతుంది. ఈప్రాంతం అభివృద్ధి చెందుతుంది. గత 50 ఏళ్లలో జరగని అభివృద్ధి ఈ నాలుగేళ్లలో జరిగింది.

– దేవరశెట్టి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి, మాదిపాడు

అభివృద్ధి అంటే ఇదీ..



నాలుగేళ్లలో నియోజకవర్గంలో రూ.2032.67 కోట్లతో అభివృద్ధి పనులు , సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఎన్నికలలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలూ నెరవేర్చాం. చంద్రబాబు ప్రభుత్వం చేసిందేమీ లేదు. లోకేష్ వచ్చి అభివృద్ధి చూసి చెప్పాలి.

– నంబూరు శంకరరావు, ఎమ్మెల్యే , పెదకూరపాడు





జెండా జయహే

అడుగులే పిడుగులై కదిలాయి. స్వాతంత్య్ర స్ఫూర్తితో పురవీధుల్లో కదంతొక్కాయి. గళాలన్నీ ఒక్కటై జెండా జయహే అంటూ గర్జించాయి. పిడుగురాళ్ల పట్టణంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 1,250 అడుగుల జాతీయ జెండాతో 1,500 మంది విద్యార్థులు గురువారం భారీ ప్రదర్శన నిర్వహించారు. జనగణమన గీతాలాపనతో నీరాజనం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కాకుమాను జగన్నాథం, హైస్కూల్ హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎ.గురవయ్య, సెక్రటరీ కె.రవి, ట్రెజరర్ బ్రహ్మం, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

– పిడుగురాళ్ల:

భూమి లేకుండానే నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్

- దళారులు, స్టాంపు రైటర్, రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది సిండికేట్
- రూ. అరకోటి మేర మోసం
- నలుగురి అరెస్టు.. స్టాంప్ రైటర్, మరో ఇద్దరు పరారీ

పెదకాకాని: అసలు అక్కడ భూమి లేదు.. కానీ ఉన్నట్లుగా నకిలీ పత్రాలు సృష్టించి రూ.అరకోటి విలువచేసే ఆస్తిని అందరూ కలిసి సిండికేట్‌గా మారి అక్రమ రిజిస్ట్రేషన్ జరిపించి విక్రయించారు. చివరకు బాధితుడి ఫిర్యాదుతో మోసం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పెదకాకాని పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పెదకాకాని సీఐ బి.సురేష్ బాబు గురువారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం బాపట్ల జిల్లా చినగంజాం మండలం చోగిరాల గ్రామానికి చెందిన శిఖరం రామాంజనేయులు, గుంటూరులోని రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన రవీంద్ర ప్రభాకర్, బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పేర్లపాడుకు చెందిన జోగి సుధీర్ బాబు మరో 70 ఏళ్ల వయసు ఉన్న వృద్ధురాలితో కలిసి పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామంలో వేరొకరి ఖాళీ స్థలాన్ని చూపించి, ఈ స్థలం తమదేనని అమ్ముతామని గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డుకు చెందిన శ్యామల అమ్మిరెడ్డి అనే వ్యక్తిని నమ్మించారు. ముందుగానే పెదకాకానికి చెందిన స్టాంప్ రైటర్ ఏనుగుల శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులతో కలిసి సిండికేట్‌గా మారారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం అమ్మిరెడ్డికి స్థలాన్ని అమ్ముతున్నట్లుగా ఒప్పందం కుదుర్చుకొని, నకిలీ ఆధార్ కార్డులు, డాక్యుమెంట్లు సృష్టించారు. దీంతో కొనుగోలుదారుడైన అమ్మిరెడ్డి నమ్మి రూ.54 లక్షలు చెల్లించి ఆ స్థలాన్ని కొన్నాడు. కొద్దిరోజుల తర్వాత వెళ్లి ఆ స్థలాన్ని చూసుకోగా అందులో వేరొకరున్నారు. ఈ స్థలం తనదని చెప్పగా.. డాక్యుమెంట్లు పరిశీలించి నకిలీ పత్రాలతో, దొంగ రిజిస్ట్రేషన్ జరిగిందని నిర్ధారణకు వచ్చారు. దీంతో అమ్మిరెడ్డి పెదకాకాని పోలీసులు ఆశ్రయించగా కేసు నమోదు చేసి ఆ వృద్ధురాలితోపాటు రామాంజనేయులు, ప్రభాకర్, సుధీర్‌బాబును అరెస్ట్ చేశారు. పెదకాకాని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్టాంపు రైటర్‌గా పనిచేస్తున్న కొప్పురావూరు గ్రామానికి చెందిన ఏనుగుల శ్రీనివాసరావు పై గతంలో 17 కేసులు ఉండగా, తాజాగా మరో కేసు నమోదైంది. ఈ కేసులో కూడా దళారులు ఈ స్టాంప్ రైటర్‌ని సంప్రదించగా పెదకాకాని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగులను ప్రలోభపెట్టి తప్పుడు రిజిస్ట్రేషన్ జరిపించినట్లు పోలీసులు నిర్ధారించారు. స్టాంప్ రైటర్ ఏనుగుల శ్రీనివాసరావు, మరో ఇద్దరు నిందితులు దుర్గా విశ్వనాథ స్వామి, నరిశెట్టి ఆంటోనీ ఆనందరాజు పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. త్వరలో వారిని అరెస్ట్ చేస్తామని సీఐ సురేష్‌బాబు వెల్లడించారు.

'జత'కోటి వందనాలు

పందెం గిత్తల ఖరీదు రూ.కోటి

హుజూర్‌నగర్: పందెం గిత్తలపై ఉన్న మోజుతో జతను బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతారం గ్రామానికి చెందిన సజ్జ సతీష్, దావులూరి వెంకట సుధాకర్‌లు రూ.కోటి పెట్టి కొనుగోలు చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన విజిలెన్స్ ఏఎస్పీ(జీహెచ్‌ఎంసీ) సుంకి సురేందర్‌రెడ్డి వద్ద పందెం గిత్తలను కొన్నారు. ఆ గిత్తలను వారు అందంగా అలంకరించి గురువారం ప్రత్యేక వాహనంలో వారి స్వగ్రామానికి తీసుకెళ్లారు. పందెం గిత్తలపై ఉన్న మోజుతోనే రూ.కోటి పెట్టి కొన్నామని దావులూరి వెంకట సుధాకర్ చెప్పారు. తమకు ఎద్దులు, వ్యవసాయం అంటే ఎంతో ఇష్టమని, ఎద్దుల పందేలలో పాల్గొనడమంటే మక్కువని వివరించారు.



పందెం గిత్తలతో వెంకటసుధాకర్, సురేందర్‌రెడ్డి

ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన అవసరం

కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థి దశ నుంచే ఆరోగ్యం, పరిశుభ్రతపై అందరూ అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ సూచించారు. మున్సిపల్ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ జి.శోభారాణి అధ్యక్షత వహించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ఆరోగ్యం, పరిశుభ్రతపై విద్యార్థి దశ నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ శివశంకర్ పలువురు విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను అందించారు. తొలుత చేతుల పరిశుభ్రత, దంతాల పరిరక్షణ, కంటి వ్యాధులు, తరచుగా వచ్చే తలనొప్పి తదితర అంశాలపై డాక్టర్ హైందవి విద్యార్థులకు వివరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ, నులిపురుగులు, రక్తహీనతకు ఉన్న సంబంధాన్ని వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, డెప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ జి.చంద్రశేఖర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టి.రవికాంత్, సులేఖ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న కలెక్టర్ శివశంకర్

భూరక్ష-భూహక్కుపై అవగాహన

- 26 జిల్లాల నుంచి పాల్గొన్న ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు
- డిసెంబర్ నెలాఖరుకు లక్ష మందికి ప్రోపర్టీ కార్డులు అందజేత
- పంచాయతీరాజ్ శాఖ ఆర్‌జేసీ ట్రైనింగ్ ఇన్‌చార్జి ప్రసాద్

తాడేపల్లిరూరల్: జగనన్న భూహక్కు-భూరక్ష పథకం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన దుగ్గిరాల మండలంలో పంటపొలాల సర్వే, హక్కుపత్రాల పంపిణీ దిగ్విజయంగా ముగియడంతో రాష్ట్రంలోని 26 జిల్లాల ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు ఇక్కడ క్షేత్రస్థాయి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలోభాగంగా గురువారం చింతలపూడి గ్రామంలో ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ రాజ్ శాఖ ఆర్‌జేసీ ట్రైనింగ్ అధికారి కె.ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఒక్కొక్క జిల్లా నుంచి ఒక ఈఓపీఆర్డీ, ఇద్దరు కార్యదర్శులు శిక్షణకు వచ్చారు. వీరికి క్షేత్రస్థాయిలో ప్రసాద్ అవగాహనకల్పించారు. డ్రోన్ సర్వే చేసే విధానం, కొత్త రికార్డుల రూపకల్పన తదితర అంశాల గురించి వివరించారు. చింతలపూడి గ్రామంలో సర్వే విజయవంతమైందని వెల్లడించారు. గ్రామ కంఠాల్లోనూ సర్వే నిర్వహించి మరో లక్ష మందికి ప్రోపర్టీ కార్డులు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోందని వెల్లడించారు. అనంతరం సర్వేలో తాము అవలంబించిన పద్ధతులపై స్థానిక అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ, చింతలపూడి పంచాయతీ కార్యదర్శి మణికంఠ, పంచాయతీరాజ్ విస్తరణ అధికారి పి.శ్రీనివాసరావు, సర్వేయర్ మంజు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పంచాయతీరాజ్ శాఖ ఆర్‌జేసీ ట్రైనింగ్ అధికారి ప్రసాదరావు

జూనియర్ సివిల్ జడ్జిగా లక్ష్మీలావణ్య



చీరాల రూరల్: చీరాల కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న వీఎస్ఎన్ లక్ష్మీ లావణ్య పెండెల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఇటీవల హైకోర్టు ప్రకటించిన ఫలితాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. ఈమె భర్త మద్ది మురళీకృష్ణ చీరాల కోర్టులోనే న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. న్యాయమూర్తిగా ఎంపికైన లక్ష్మీ లావణ్య సాధారణ గృహిణిగా ఉంటూ చదువుకోవాలనే మక్కువతో 2017లో ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో చదువు పూర్తిచేశారు. 2022లో హైకోర్టు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకోసం పరీక్షలు రాశారు. మొదటి ప్రయత్నంలోనే ఆమె ప్రథమ స్థానంలో నిలిచారు. ఒకవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు చదువుకుంటూ తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు. తనకు తన భర్త మురళీ కృష్ణతోపాటు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉందని, వారి ఆశీర్వాదం వల్లే తాను జడ్జిగా ఎంపికయ్యానని లక్ష్మీ లావణ్య చెప్పారు. లక్ష్మీలావణ్యను చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు అభినందించారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో బంగారం మాయం

- బ్యాంకు ఉద్యోగులు ఇద్దరు సస్పెన్షన్
- గోల్డ్ అప్రైజర్‌ను విచారిస్తున్న అధికారులు



మేనేజరు మధుబాబుతో మాట్లాడుతున్న ఖాతాదారులు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో కుదువ పెట్టుకున్న బంగారం వస్తువులు కనబడటం లేదని బ్యాంకులోని గోల్డ్ అప్రైజర్ కాజేసాడని, రుణం డబ్బులు చెల్లించినా కుదువ బంగారం వస్తువులు ఇవ్వటం లేదని ఖాతాదారులు గురువారం బ్యాంకు వద్ద ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా.. దొడ్లేరు చైతన్య గ్రామీణ బ్యాంకు ద్వారా సుమారు 10 గ్రామాల లావాదేవీలు జరుగుతుంటాయి. మరీ ముఖ్యంగా రైతులు అధికంగా బ్యాంకులో పంట రుణాలు, బంగారం పెట్టి రుణాలు తీసుకుంటుంటారు. బ్యాంకులో కుదువ పెట్టి బంగారం సొమ్ములపై తీసుకున్న రుణం మొత్తం చెల్లించినప్పటికీ బ్యాంకు సొమ్ములు ఇవ్వలేదని కొందరు ఖాతాదారులు తెలుపుతుండగా, కొంతమంది బంగారం సొమ్ములు కూడా మాయం చేశారని ఆందోళన చెందుతున్నారు. నాలుగు వస్తువులు కుదువ పెడితే మూడు మాత్రమే ఇస్తున్నట్లు వాపోతున్నారు. బ్యాంకు మేనేజరు మధుబాబు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు హుటాహుటిన చేరుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది. అనధికారిక సమాచారం మేరకు బ్యాంకులో రూ.43.50 లక్షల విలువగల బంగారం సొమ్ముల్లో అవతవకలు జరిగినట్లు తెలిసింది. అందులో రూ.9 లక్షలు బంగారం సొమ్ములపై ఇచ్చిన నగదులో అవతవకలు, రూ.10 లక్షలు విలువ గల నగల స్థానంలో డూప్లికేట్ నగలు పెట్టినట్లు, మిగతా రూ.24.50 లక్షల విలువ చేసే సొమ్ముల్లో తూకాల్లో అవకతవలు జరిగినట్లు గుర్తించారు. ఇంకా పూర్తిస్థాయిలో విచారణ జరపాల్సి ఉందని తెలిసింది. దీనిపై బ్యాంకులో పనిచేస్తున్న క్యాషియర్ బి.నితీష్, మరొక అధికారి రవడకార్తీని సస్పెండ్ చేయగా బ్యాంకు గోల్డ్ అప్రైజర్ నాగార్జునను విచారిస్తున్నట్లు తెలిసింది. బ్యాంకులో జరిగిన అవకతవలపై ఎస్ఐ పాల్‌రవీందర్ కూడా పూర్తిస్థాయిలో సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు.

‘వ్యూహం’ సినిమా కొనసాగింపుగా ‘శపథం’

- తెనాలిలో వ్యూహం సినిమా సన్నివేశాలు చిత్రీకరించిన దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ
- సినిమా అద్భుతంగా వస్తోందన్న నిర్మాత దాసరి కిరణ్‌కుమార్



జగన్‌మోహన్‌రెడ్డి పాత్రధారి అజ్మల్‌తో రామ్‌గోపాల్‌వర్మ

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీవితంలో జరిగిన సంఘటలను దృష్టిలో ఉంచుకుని రామదూత క్రియేషన్స్ పతాకంపై రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో దాసరి కిరణ్‌కుమార్ నిర్మిస్తున్న ‘వ్యూహం’ సినిమాలో కొన్ని సన్నివేశాలను గురువారం తెనాలిలో చిత్రీకరించారు. స్థానిక చెంచుపేటలోని చావాస్ గ్రాండ్ కల్యాణ మండపంలో కార్యకర్తలతో సమావేశాన్ని, అనంతరం జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రను ఇక్కడ తీశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాత్రధారి అజ్మల్, వై.ఎస్.విజయమ్మ, వై.ఎస్.భారతి, వై.ఎస్.షర్మిలమ్మ పాత్రధారులు, నవరత్నాలు వైస్ చైర్మన్ అంకిరెడ్డి నారాయణ మూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో అభిమానులు సందడి చేశారు. చిత్రదర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, సినిమా కథకు సంబంధించిన లోకేషన్లు తెనాలి, పరిసర ప్రాంతాల్లో ఉన్నందున, ఇక్కడ షూటింగ్ జరుపుతున్నట్టు చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణానంతరం ఏర్పడిన పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రయత్నించిన రాజకీయ పార్టీల ఎత్తులు, వాటి నుంచి పుట్టుకొచ్చిన పొలిటికల్ థ్రిల్లర్ ‘వ్యూహం’ చిత్రంగా చెప్పారు. 2014–19 మధ్య పరిణామాలే వ్యూహం చిత్రమని, 2019 నుంచి ఇప్పటి వరకు జరిగిన సంఘటనలతో కొనసాగింపుగా ‘శపథం’ చిత్ర ఉంటుందని తెలిపారు. చిత్ర నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీవితంలో 2009–2019 వరకు జరిగిన నిజజీవిత ఘటనలు, రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో ‘వ్యూహం’ సినిమాను తీస్తున్నట్టు చెప్పారు. సొంత ఊరు తెనాలిలో కొన్ని సన్నివేశాలను తీయాలని తపన పడ్డానని చెబుతూ ఈరోజుతో ఆ కోరిక నెరవేరిందన్నారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మిత్రులు, కార్యకర్తల సహకారంతో ముఖ్యమైన ఘట్టాలను ఇక్కడ చిత్రీకరించామని చెప్పారు. సినిమా అద్భుతంగా వస్తోందన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని ఏరకంగా ఇబ్బందులు పెట్టారు? వాటిని ఎదుర్కొంటూ ఎంత శక్తిగా ఆయన మారారు? అనేది ప్రతి ప్రేక్షకుడి గుండెను తాకేలా దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ దృశ్యీకరిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరినీ ఈ చిత్రం ఆలోచింపజేస్తుందని, ప్రేక్షకులు జగన్‌మోహన్‌రెడ్డిని మరింత ఆత్మీయంగా సొంతం చేసుకుంటారని భావిస్తున్నట్టు వివరించారు.

షేక్ సాధిక్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు



షేక్ సాధిక్‌ను అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రత్తయ్య

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఎంటెక్ ఫుడ్ టెక్నాలజీ విభాగానికి చెందిన విద్యార్థి షేక్ సాధిక్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్–2023 అవార్డు, గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని సాధించాడని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపా రు. ‘‘యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ’’ పేరుతో విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థి షేక్ సాధిక్, మరికొందరు విద్యార్థులు గుంటూరు, తెనాలి ప్రాంతాలలో 800కు పైగా సామాజిక, సేవా కార్యక్రమాల ద్వారా 35 వేల మంది ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సౌకర్యాలను కల్పించడం వలన ఈ అవార్డు లభించింది. ట్రాన్స్‌ఫార్మింగ్ లైఫ్స్ స్పాట్ లైటింగ్ ద వర్క్ ఆఫ్ యాన్ ఎమినెంట్ సోషల్ యాక్టివిస్ట్‌గా గుర్తించి లండన్‌లోని హార్వర్డ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, మెడల్ అందించిందని వీసీ తెలిపారు. విద్య, వైద్యం, వృద్ధులు, అనాథలు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి కోసం కృషి చేస్తుండటంతో ప్రతిష్టాత్మక ఇన్‌ఫ్లూయన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందాడని తెలిపారు. వికలాంగులకు వీల్‌చైర్లు, వృద్ధులకు కర్రలు అందజేస్తున్నారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డులో స్థానం సంపాదించిన షేక్ సాధిక్‌ను చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు.

యార్డుకు 29,953 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 29,953 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 28,490 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి 23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి 14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,162 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కుడికాలువకు నీటి విడుదల పునరుద్ధరించాలి

నరసరావుపేట: నాగార్జునసాగర్ కుడికాలువ ఆయకట్టుకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని ఏపీ రైతు సంఘ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నరసరావుపేటలో మాట్లాడుతూ మెట్ట పంటలు సాగుచేసి దాదాపు రెండు నెలలు కావస్తున్నా, ప్రాథమిక దశలో ఉన్న పైర్లు నీటి కొరతను ఎదుర్కొంటున్న తరుణంలో సాగునీరు నిలుపుదల ద్వారా పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. విత్తనాలు, సాగు కోసం వేల రూపాయల ఖర్చు చేసినటువంటి రైతులు తన కళ్లముందే పంటలు ఎండిపోయే దశకు చేరడంతో మనోవేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా మిరప నారు నాటుతున్న రైతులు నీటి కోసం ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా తెచ్చుకోవటం వల్ల, అదనంగా పదివేల రూపాయలు రైతులపై భారం పడుతుందన్నారు. గతంలో సాగర్ ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ లెవెల్‌లో నీరున్నా, పంటలను కాపాడే నిమిత్తం విడుదల చేయటం జరిగిందన్నారు. వెంటనే సాగునీటిని విడుదల చేయకుంటే అంతంతమాత్రంగా ఉన్నటువంటి రైతుల జీవితాలు మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారవుతాయని అన్నారు.

రామిరెడ్డిపాలెంకు ఒక్కటే నామినేషన్

మొత్తం రెండు సర్పంచ్ పదవులకు ఆరు, 48 వార్డులకు 81 నామినేషన్లు దాఖలు

నరసరావుపేట: జిల్లాలో ఈనెల 19న నిర్వహించే సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలకు రొంపిచర్ల మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామ సర్పంచు పదవికి ఒక్క నామినేషనే నమోదైనట్లు జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి గురువారం వెల్లడించారు. 31వార్డులకు ఒక్కొక్క నామినేషనే దాఖలు చేశారన్నారు. జిల్లాలో రెండు గ్రామాలైన క్రోసూరు మండలంలోని గరికపాడు, రొంపిచర్ల మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామ సర్పంచు పదవులకు, అలాగే 20మండలాల పరిధిలోని 48వార్డు పదవులకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే నాటికి గరికపాడు పంచాయతీ సర్పంచు పదవికి ఐదు నామినేషన్లు దాఖలు కాగా, మొత్తం వార్డులకు 81 నామినేషన్లు దాఖలయ్యాయన్నారు.

చేనేతకు పూర్వ వైభవం



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న జౌళి శాఖ ఏడీ వనజ, ఎమ్మెల్యే కరణం

వేటపాలెం: చీరాల ప్రాంతంలో చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురానున్నట్లు చేనేత జౌళి శాఖ ఏడీ వనజ పేర్కొన్నారు. వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని చేనేతపురి కాలనీ దగ్గరలో హ్యాండ్లూమ్ పార్కు స్థలాన్ని ఏడీ, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో త్వరలో చేనేత పార్కు నిర్మాణం చేపట్టి చేనేత వస్తువులను క్రయ విక్రయాలు చేయిస్తామని తెలిపారు. దీనికి సంబంధంచిన ప్రణాళిక త్వరలో సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వీరి వెంట చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఏడీ ఉమామహేశ్వరరావు, గోలి ఆనందరావు, పాండు, కర్ణ లక్ష్మరావు, ఎంపీడీవో నేతాజీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గ్రానైట్ కార్మికుడి మృతి



మృతిచెందిన దయాసాగర్

మార్టూరు: విద్యుదాఘాతంతో గ్రానైట్ కార్మికుడు మృతి చెందిన ఘటన మార్టూరులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫత్తేపూర్ జిల్లా హమౌలీ గ్రామానికి చెందిన దయాసాగర్ (25) స్థానిక రాజుపాలెం డొంకలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈక్రమంలో స్లాబులు కటింగ్ చేసే మిషన్‌ను ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. స్థానికులు దయాసాగర్‌ను చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించటంతో మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. మృతుడు దయాసాగర్, భార్య సదాప్యారీలకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం దయాసాగర్ భార్య గర్భిణిగా ఉన్నట్లు తోటి కార్మికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డులను వినియోగించుకోవాలి



పశుగ్రాసం విత్తనాలు అందజేస్తున్న పశు వైద్యాధికారులు హనుమంతరావు, చిన్నయ్య

కర్లపాలెం: రైతులు కిసాన్ క్రెడిట్ కార్డులను వినియోగించుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి హనుమంతరావు తెలిపారు. చింతాయపాలెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు 75శాతం రాయితీలో పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేశారు. హనుమంతరావు మాట్లాడుతూ వైఎస్సార్ పాలవెల్లువ పశువులకు అవసరమైన దాణా అందజేస్తామని తెలిపారు. జిల్లా ప్రత్యేకాధికారి చిన్నయ్య మాట్లాడుతూ మేలు జాతి పశువులను తెచ్చుకోవటం వలన అధిక పాలదిగుబడి వస్తుందని చెప్పారు. పశువులకు వచ్చే వ్యాధులకు సకాలంలో వైద్యం చేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కర్లపాలెం పశువైద్యాధికారి ఎం.రేచల్ దివ్య, డెప్యూటీ డైరక్టర్ కేదారేశ్వర్, ఏడీఏ శంకర్‌రావు, రైతులు తదితరులు ఉన్నారు.

సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తొలగింపునకు చర్యలు



కొల్లూరులో సాగునీటి సరఫరా గురించి రైతులను అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయశాఖ జేడీఏ అబ్దుల్ సత్తార్

కొల్లూరు: ఖరీఫ్ సాగుకు అవసరమైన సాగునీటి సరఫరాను ప్రణాళికాబద్ధంగా పంట కాల్వల ద్వారా విడుదల చేస్తూ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్‌కే. అబ్దుల్ సత్తార్ అన్నారు. గురువారం మండలంలోని క్రాప–కొల్లూరు గ్రామాల నడుమ క్షేత్ర స్థాయిలో సాగు నీరు సరఫరా అవుతున్న పంట కాల్వలను పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొల్లూరు మండలం వరకు సాగునీటి సరఫరాలో స్వల్ప ఇబ్బందులు మినహాయించి ఎటువంటి సమస్యలు లేనప్పటికీ దిగువ ప్రాంతాలైన భట్టిప్రోలు, రేపల్లె, కర్లపాలెం ప్రాంతాలలో రైతులకు సాగు నీరు సరఫరా తగినంతగా చేపట్టేందుకు చేపట్టాల్సిన కార్యచరణపై నీటిపారుదల శాఖాధికారులతో చర్చలు జరిపారు. నీటి విడుదలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ సాగు నీటి సరఫరా సవ్యంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీఏఏ, వీహెచ్‌ఏలు పంట నమోదు ప్రక్రియ చేపట్టి వచ్చేనెల 15 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు తమ పరిధిలోని ఆర్‌బీకేలలో సంప్రదించి తమ పంటలను నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొల్లూరు ఇరిగేషన్ ఏఈ సాంబశివరావు, వ్యవసాయశాఖ ఏఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని మార్చండి

వైన్స్ షాప్ ఎదుట మహిళల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న మహిళలు

నరసరావుపేటటౌన్: రాకపోకలకు అసౌకర్యంగా మారిన మద్యం దుకాణాన్ని మరో ప్రాంతానికి మార్చాలని ఆ ప్రాంత వాసులు గురువారం వైన్స్ షాపు ఎదుట ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిలకలూరిపేట రోడ్డు ఓవర్‌బ్రిడ్జి సమీపంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పనసతోట, నిమ్మతోట ప్రాంతానికి చెందిన మహిళలు మార్కెట్, ఇతర అవసరాల కోసం బజార్‌కు వెళ్లాలంటే ఈ మద్యం దుకాణం మీదుగానే వెళ్లాలన్నారు. మద్యం దుకాణం పరిసరాల్లో బహిరంగ మద్యపానం చేస్తుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామన్నారు. రాత్రిళ్లు వీధుల్లో తాగి బీరుసీసాలు రోడ్లపై పగలగొడుతున్నారన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఎంతో అవస్థలు పడుతున్నారన్నారు. జనవాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాన్ని మరో ప్రాంతానికి మార్చాలని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని మరో ప్రాంతానికి మార్చాలని కోరారు. ఆందోళనలో జాన్‌బీ, బాజీబీ, సైదాబీ, మౌలాబీ తదితర మహిళలు పాల్గొన్నారు. విషయంపై ఎక్సైజ్ సీఐ మహ్మద్ బాషాను వివరణ కోరగా మద్యం దుకాణంపై ఫిర్యాదులు అందాయని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

అండర్–16 బాలుర సెంట్రల్‌జోన్ మ్యాచ్‌లు ప్రారంభం



కె.ప్రణీత్‌పవన్ (124 పరుగులు)

నరసరావుపేట ఈస్ట్: పెదచెరువులోని ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో గురువారం నుంచి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–16 బాలుర అంతర్ జిల్లాల ఆంధ్ర సెంట్రల్‌జోన్ మూడు రోజుల టెస్ట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన పశ్చిమ గోదావరి జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్లు కోల్పోయి 243 పరుగులు చేసింది. కె.ప్రణీత్‌పవన్ 124 పరుగులు, రణదీప్ 40 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. జట్టు ఓపెనర్ ఎస్.రేవంత్ 68 పరుగులు సాధించాడు. ప్రకాశం జిల్లా బౌలర్లు గిరీష్, జష్వింత్‌లకు చెరో వికెట్ లభించింది. మ్యాచ్‌ను ఏసీఏ సెలెక్షన్ కమిటీ సభ్యులు నాగార్జున, సాగర్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

మీ పాలనలో జరిగిన అభివృద్ధి చూపండి

లోకేష్, కొమ్మాలపాటిలకు ఎమ్మెల్యే నంబూరు సెల్ఫీ ఛాలెంజ్



సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నారా లోకేష్.... 10 సంవత్సరాలపాటు ఎమ్మెల్యేగా ఉన్న కొమ్మాలపాటి శ్రీధర్‌లు పెదకూరపాడులో చేసిన అభివృద్ధిపై ఒక సెల్ఫీ తీసి చూపించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సవాల్ విసిరారు. పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను చూపిస్తూ సెల్ఫీ చాలెంజ్ విసిరారు. పెదకూరపాడు మండలంలో 75త్యాళ్లూరు జెబీ పాఠశాల, క్రోసూరు మండలం ఊటుకూరులో నిర్మించిన జగనన్న కాలనీ, పెదకూరపాడులోని నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం, క్రోసూరులోని నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల, అమరావతి–రాజుపాలెం డబుల్ రోడ్డు వద్దకు వెళ్లి సెల్ఫీ చాలెంజ్ చేశారు. ప్రజలకు మంచి చేయలేని వారు పాదయాత్ర చేసే అర్హత లేదన్నారు. పాదయాత్ర ద్వారా ప్రజల గుండె చప్పుడు విన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చారన్నారు. నియోజకవర్గంలో రూ.1300 కోట్లతో సంక్షేమం, రూ.655 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఒక పేదవాడికైనా ఇల్లు నిర్మించారా అన్ని లోకేష్, కొమ్మాలపాటిని ప్రశ్నించారు. ఒక అభివృద్ధి చేసి ఉంటే సెల్ఫీ అయినా తీసుకోగలరా... అన్ని అన్నారు. ప్రజారోగ్యం ప్రథమంగా పనిచేశామన్నారు. సొంతింటి కల నెరవేర్చింది మేమే అన్నారు. క్రోసూరులో పాలిటెక్నిక్ కాలేజి కట్టింది మేమే అన్నారు. రోడ్లు నిర్మిస్తు దశాబ్దాల కల తీరుస్తుంది మేమే అన్నారు.

పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత ప్రభుత్వానిదే

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



కొప్పరపాడులో విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

బల్లికురవ: నాడు–నేడులో భాగంగా ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మార్చడంతోపాటు ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహిస్తోందని పట్టభద్రుల గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రశంసించారు. గురువారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బల్లికురవలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలలు బలోపేతంతో పాటు ఉపాధ్యాయులందరికీ స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతులు కల్పించారన్నారు. వాచ్‌మెన్‌లు లేని పాఠశాల సైతం వాచ్‌మెన్‌లను నియమించారని, త్వరలో ప్రతి పాఠశాలకు డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 5 లక్షల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారని ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. 20 వేల వరకు ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని వివరించారు. 1998 డీఎస్సీలో అర్హత పొంది ఉపాధ్యాయులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 4072 మందికి పోస్టులు ఇచ్చారన్నారు. ఇంకా 2068 మందికి పోస్టులు ఇవ్వాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని 350 కేజీబీవీలో పనిచేస్తున్న సీఆర్‌టీలకు మినిమం టైం స్కేలు ఇవ్వాలని కోరామన్నారు. ఎన్ఎమ్ఎస్ పరీక్షల్లో గతేడాది విద్యా సంవత్సరంలో కొప్పరపాడు ఉన్నత పాఠశాలలో 9 మంది విద్యాఅర్హత సాధించారు. ఎమ్మెల్సీ విద్యార్థులను నగదుతో సత్కరించారు. మాదాల స్రవంతి రాష్ట్ర స్థాయిలో రెండోస్థానం, జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు. కార్యక్రమంలో కొప్పరపాడు పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా, మండల శాఖ బాధ్యులు వినయ్ కుమార్ ఏ.శ్రీనివాసరావు, పీ.రామాంజనేయులు, డీ శేషగిరి, చంటి శ్రీనివాసరెడ్డి, జీ.వీరాంజనేయులు, సీహెచ్ అచ్యుత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అద్దంకి రూరల్: అద్దంకి బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. స్థానిక బస్టాండ్‌లో దర్శివైపు వెళ్లే బస్సులు ఆగే షెడ్డు వద్ద ప్రయాణికులు కూర్చునే కుర్చీల పక్కన గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాల కలిగిన వ్యక్తి మృతిచెంది పడిఉన్నారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.